ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	587 (305.9818)	4,74,305	5,16,877
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.60 (3.60)	4,789	12,222
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.50 (41.98)	6,36,945	6,02,310

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా సూర్యాపేట జిల్లాలో కుండపోత కురిసింది. కోదాడ జలమయమైంది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. వరదలో కొట్టుకుపోయి ఇద్దరు మృతి చెందారు. కోదాడ మండలం తొగర్రాయి, కూచిపూడిలో 20కి పైగా ఇళ్లు నేలమట్టమయ్యాయి. నడిగూడెం మండలంలో సాగర్ ఎడమకాల్వకు రెండు చోట్ల గండి పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతోపాటు ఇళ్లలోకి వరద చేరింది. పంట పొలాలను వరద ముంచెత్తింది. మూసీ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచాయి.

కుండపోత

నల్లగొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నల్లగొండ జిల్లాలో రెండోరోజు ఆదివారం భారీ వర్షం కురిసింది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లాలో 5.2మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నార్కట్‌పల్లిలో 32.6మి.మీ, చిట్యాల 24.0, కట్టంగూరులో 19.0మి.మీ, శాలిగౌరారం మండలంలో 16.8మి.మీ, అత్యల్పంగా హాలియాలో 0.2మి.మీ వర్షపాతం నమోదైంది. నాగార్జునసాగర్, మూసీకి వరద పోటెత్తగా, వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు విడుదల చేస్తున్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని, నదీ తీరగ్రామాల ప్రజలు నదిలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. సాగర్ నుంచి మొత్తం 5,66,494 క్యూసెక్కుల పైచిలుకు వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. అడవిదేవులపల్లిలోని టెయిల్‌పాండ్ వద్ద సైతం అంతే మొత్తంలో దిగువకు నీరు వెళ్తోంది. మూసీకి ఆదివారం ఉదయం కొంత వరద తగ్గింది. 5,600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూసీ వరదతో పరివాహక ప్రాంతాలైన శాలిగౌరారం, నార్కట్‌పల్లి, కేతేపల్లి, నకిరేకల్, సూర్యాపేట, మాడ్గులపల్లి, వేములపల్లి, మిర్యాలగూడ, నేరేడుచర్ల, దామరచర్ల తదితర పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. లోలెవల్ బ్రిడ్జిలపైకి నీరు చేరడంతో రాకపోకలు కొద్దిసేపు స్తంభించాయి. శాలిగౌరారం ప్రాజెక్టుకు నిండటంతో ఫీడర్‌చానల్ ద్వారా 15 చెరువులను నీటితో నింపారు.

కట్టంగూరు మండలంలో ఈదులూరు, యరసానిగూడెం చెరువులు అలుగులు పారుతున్నాయి. నార్కట్‌పల్లిలో అమ్మనబోలు చెరువు నిండడంతో రోడ్డుపైకి నీరుచేరి రాకపోకలు నిలిచాయి. చండూరులో చనగాని చెరువుకు నీరురాకుండా వాగును మళ్లించడంతో దిగువన ఉన్న పడమటితాళ్ల చెరువుకు నీళ్లందడం లేదు. ఉడతలపల్లి చెరువు తూము ధ్వంసం కావడంతో నీరు వృథాగా పోతోంది. మునుగోడు మండలం సోలిపురం వాగు ప్రవహిస్తుండడంతో రాకపోకలు స్తంభించాయి. హాలియా మండలంలో పేరూరు చెరువు నిండింది.

65వ నెంబర్ జాతీయరహదారిపై ప్రయాణించాల్సిన వాహనాలను నార్కట్‌పల్లి- అద్దంకి హైవేకి మళ్లించారు. దీంతో ఈ మార్గంలో రద్దీగా మారింది.

(ఆంధ్రజ్యోతి, యాదాద్రి): యాదాద్రి జిల్లాలో పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. శనివారం నుంచి ఆదివారం వరకు జిల్లాలో 9.02సెం.మీ సగటున వర్షపాతం నమోదైంది. అడ్డగూడూరు మండలంలో 18.16సెం.మీ, పోచంపల్లిలో 13.83, బీబీనగర్‌లో 9.80, మోత్కురులో 9.07సెం.మీ వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌తోపాటు నగరశివారు ప్రాంతాల్లో కురుస్తోన్న వర్షాలకు మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో జిల్లాలోని బీబీనగర్ మండలం రుద్రవెల్లి బ్రిడ్జి, వలిగొండ మండలం సంగెం వద్ద బ్రిడ్జి వద్ద రాకపోకలు నిలిపివేశారు. భారీ వర్షాలకు మూసీ పరవళ్లు తొక్కుతుండటంతో బీబీనగర్-పోచంపల్లి, వలిగొండ- చౌటుప్పల్, నారాయణపూర్ మండలాల్లోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భువనగిరి మండలం బండసోమారంలో పిడుగుపడి ఆవులు మృత్యువాతపడ్డాయి. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధికి వచ్చిన భక్తులు వర్షాలకు ఇబ్బందులు పడ్డారు. భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి వార్డులోకి ఆదివారం వర్షపు నీరు చేరింది. వార్డు కిటీకీ అద్దాలు లేకపోవడంతో వర్షం నీరు పలు బెడ్లపైకి చేరాయి. దీంతో అప్రమత్తమైన ఆస్పత్రి సిబ్బంది రోగులను ఇతర పడకలపైకి మార్చారు. వర్షం నీరు శుభ్రం చేశారు. కిటీకీలకు అద్దాలు బిగింపునకు చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి అధికారులు తెలిపారు.



వలిగొండ మండలం సంగెం వద్ద రాకపోకలను నిలిపివేస్తూ ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డులు

మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ దారిమళ్లింపు



బీబీనగర్, మఠంపల్లి: భారీ వర్షాల నేపథ్యంలో బీబీనగర్-ఖాజీపేట మీదుగా వెళ్లే పలు రైళ్లను పూర్తిగా రద్దు చేయగా, మరికొన్ని రైళ్లను బీబీనగర్-నల్లగొండ మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నారు. శనివారం రాత్రి సికింద్రాబాద్ నుంచి ఖాజీపేట మీదుగా మచిలీపట్నానికి బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ రైలును ఖాజీపేట వద్ద నిలిపివేశారు. కేసముద్రం వద్ద భారీ వరదల కారణంగా రైల్వే ట్రాక్ కొట్టుకుపోవడంతో ముందుకు వెళ్లలేని పరిస్థితుల్లో రైల్వే అధికారులు మచిలీపట్నం వెళ్లాల్సిన రైలును ఖాజీపేట స్టేషన్‌లోనే నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు రైల్వే అధికారులతో వాగ్వివాదానికి దిగడంతో ఆదివారం ఉదయం ఖాజీపేట నుంచి బీబీనగర్ స్టేషన్ వరకు వెనక్కు రప్పించి పగిడిపల్లి రైల్వే క్రాసింగ్ నుంచి నల్లగొండ మీదుగా రైలును పంపించారు. దీంతో ప్రయాణికులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. అదేవిధంగా విజయవాడ, గుంటూరు వెళ్లే పలు రైళ్లను అధికారులు మేళ్లచెరువు, మఠంపల్లి మీదిగా నడికుడి జంక్షన్‌కు మళ్లించారు. నడికుడి నుంచి గుంటూరుకు రైళ్లను మళ్లించినట్టు రైల్వే అధికారులు తెలిపారు. కాగా, మఠంపల్లికి ప్యాసింజర్ రైలు రావడంతో, రానున్న రోజుల్లో మఠంపల్లికి ప్యాసింజర్ రైళ్లు నడుస్తాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

(ఆంధ్రజ్యోతి, సూర్యాపేట)/కోదాడ: జిల్లాలో 20.07 సెంటీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మద్దిరాలలో 34.13 సెం.మీ, అత్యల్పంగా పాలకీడులో 5.15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోదాడలోని రిజిస్ట్రేషన్ కార్యాలయ సమీపంలోని పంట కాల్వను రవి అనే వ్యక్తి కారులో ప్రయాణిస్తూ దాటుతుండగా, కారుతో పాటు కొట్టుకుపోయి మృతిచెందాడు. శ్రీమన్నారాయణకాలనీ సమీపంలో ఉన్న కాల్వను వెంకటేశ్వర్లు బైక్‌తో పాటు దాటుతుండగా కొట్టుకుపోయి చనిపోయాడు. అదేవిధంగా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద పాలేరు బ్యాక్ వాటర్ జాతీయ రహదారి 65పైకి చేరడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో ట్రాఫిక్ మళ్ళించారు. విజయవాడ నుంచి గుంటూరు అద్దంకి, మిర్యాలగూడెం, నల్లగొండ, హైదరాబాద్‌కు వాహనాలు మళ్లించారు. విజయవాడ నుంచి ఖమ్మంకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు అలుగు పోసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో అదనపు కలెక్టర్ బీఎస్.లత పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఆత్మకూరు(ఎస్) గ్రామానికి చెందిన కొంక అభిషేక్(21)తో పాటు అతడి మిత్రులు జీవన్, సాయికిరణ్, దుర్గాప్రసాద్‌లు శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సూర్యాపేట పట్టణంలోని రాజీవ్‌పార్కు సమీపంలోకి రాగానే భారీగా వర్షం కురుస్తుండడంతో జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన బ్యారీకేడ్లను ఢీకొట్టారు. దీంతో కారు అదుపుతప్పి పల్టీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అభిషేక్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆత్మకూర్(ఎస్) మండలంలో వాగులు వంకలు, చెరువులు పొంగిపోర్లాయి, మండలంలోని ఏపూర్ గ్రామంలో పంట పొలాల్లోకి నీరు చేరింది. మట్టంపల్లి మండలంలో ఎస్సీకాలనీలోని చౌటపల్లి ఊర చెరువు వరద నీరు అధికంగా చేరడంతో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పరిశీలించారు. చివ్వెంల మండలంలో చెరువులు అలుగు పోస్తున్నాయి. జిల్లా కేంద్రంలో లోతట్టు ప్రాంతాలైన సుందరయ్యనగర్‌తోపాటు సద్దుల చెరువు, పుల్లారెడ్డి చెరువును మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పరిశీలించి అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు అదనపు కలెక్టర్ బీఎస్.లత ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

హైదరాబాద్-విజయవాడ మధ్య రాకపోకలు బంద్

కోదాడరూరల్: మండలంలోని పాలేరు వాగు ప్రమాదకరస్థాయిలో పొంగి ప్రవహిస్తోంది. నల్లబండగూడెం వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిలో వంతెన వద్ద ఐదు అడుగుల మేర నీరు ప్రవహిస్తుండటంతో హైదరాబాద్-విజయవాడ మధ్య రాకపోకలు నిలిచాయి. శనివారం ఉదయం నుంచే పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తూ సాయంత్రానికి ప్రమాదకర స్థాయికి చేరింది. వెంటనే చెక్‌పోస్టు సిబ్బంది కోదాడ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ అనిల్‌రెడ్డి చేరుకున్నారు. అప్పటికే ఇరువైపులా వాహనాలు నిలిచాయి. దీంతో అక్కడ పోలీస్ అధికారులతో మాట్లాడి ఏపీ వైపు నుంచి వచ్చే వాహనాలను గుంటూరు, అద్దంకి, మిర్యాలగూడ, నల్లగొండ మీదుగా హైదరాబాద్‌కు మళ్లించారు.

సాగర్ ఎడమకాల్వకు రెండుచోట్ల గండి

నడిగూడెం: సాగర్ ఎడమకాల్వకు ఆదివారం రెండుచోట్ల గండి పడింది. పాలేరు రిజర్వాయర్ నుంచి బ్యాక్ వాటర్ ఉధృతి పెరగడంతో కాగిత రామచంద్రాపురం వద్ద 132, 133 కిలోమీటర్ల పరిధిలో రెండు చోట్ల 60అడుగుల మేర గండి పడినట్లు అధికారులు గుర్తించారు. వర్షాలకు తోడు ఎడమకాల్వలో నీటి ప్రవాహం అంచులను తాకుతూ ప్రవహిస్తున్నందున కాల్వకు గండి పడింది. పాలేరు బ్యాక్ వాటర్ ప్రభావంతో సిరిపురం డీప్‌కట్ వద్ద వంతెనపై నుంచి నీరు గ్రామంలోని ఇళ్లలోకి చేరింది. గండి పడిన ప్రదేశాన్ని ఎన్నెస్పీ సీఈ రమేష్‌బాబు, డీఈలు రఘు, రామకృష్ణ, ఏఎస్పీ నాగేశ్వరావు పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టి సాగర్ ప్రాజెక్టు ద్వారా నీటి విడుదల నిలిపివేశారు.

- ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం
- అత్యధికంగా సూర్యాపేట జిల్లా మద్దిరాలలో 34.13సెంటీమీటర్లు
- హైదరాబాద్-విజయవాడ మధ్య రాకపోకలు బంద్
- నార్కట్‌పల్లి మీదుగా వాహనాల మళ్లింపు
- నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురంలో సాగర్ ఎడమకాల్వకు రెండు చోట్ల గండి
- నీట మునిగిన పంట పొలాలు
- కోదాడలో వరదలో కొట్టుకుపోయి ఇద్దరి మృతి
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఇళ్లలోకి చేరిన వరద



కోదాడలో కొట్టుకువచ్చిన కార్లు


కోదాడలో సహాయకచర్యలు



మఠంపల్లి మండలంలో కొట్టుకుపోయిన రహదారి



నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమకాల్వకు పడిన గండి



అలుగు పోస్తున్న కనగల్ వాగు



మద్దిరాల మండలంలో జాతీయ రహదారికి ఏర్పడిన గండి

జిల్లా / మండలం	అత్యధిక వర్షపాతం
సూర్యాపేట సగటు	**8.9మి.మీ**
మునగాల	71.5
ఆత్మకూరు(ఎస్)	18.8
నల్లగొండ సగటు	**5.2మి.మీ**
నార్కట్‌పల్లి	32.6
చిట్యాల	24.0
యాదాద్రి సగటు	**24.2మి.మీ**
ఆలేరు	35.8
పోచంపల్లి	35.5
రాజాపేట	30.9
రామన్నపేట	30.3

అత్యవసరమైతే ఇలా వెళ్లాలి : సూర్యాపేట జిల్లా ఎస్పీ

భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఖమ్మం వెళ్లేందుకు హైదరాబాద్ నుంచి చౌటుప్పల్, నార్కట్‌పల్లి, నకిరేకల్ నుంచి అర్వపల్లి మీదుగా తుంగతుర్తి నుంచి నూతనకల్, మరిపెడబంగ్లా మీదుగా ప్రయాణం చేయాలన్నారు. విజయవాడ వెళ్లాలంటే హైదరాబాద్ నుంచి చౌటుప్పల్, నార్కట్‌పల్లి నుంచి నల్లగొండ మీదుగా మిర్యాలగూడ నుంచి పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు నుండి విజయవాడ చేరుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ హెల్ప్‌లైన్ 9010203626, సూర్యాపేట జిల్లా హెల్ప్‌లైన్ నెంబరు 8712686026ను సంప్రదించాలని ఎస్పీ తెలిపారు.

జలదిగ్బంధంలో తొగర్రాయి, కూచిపూడి

- బాహ్యప్రపంచంతో తెగిపోయిన సంబంధాలు
- నీటమునిగిన పంట పొలాలు
- ప్రాజెక్ట్‌లకు జలకళ
- నిండుకుండల్లా జలాశయాలు
- అందరూ అప్రమత్తంగా ఉండాలి : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ప్రమాదం అంచున మట్టపల్లి క్షేత్రం
- ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ
- అడుగుమేర చేరిన వరద నీరు

•7లో..

ఎంజీయూలో ఎంఈడీ, ఎల్‌ఎల్‌బీ

పరీక్షలు వాయిదా

నల్లగొండ, సెప్టెంబరు 1: భారీ వర్షాల నేపథ్యంలో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ పరిధిలో సోమవారం జరగాల్సిన ఎంఈడీ, ఎల్‌ఎల్‌బీ పరీక్షలను వాయిదా వేసినట్లు ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డా.ఉపేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించిన నేపథ్యంలో ఈ నెల 2వ తేదీన జరగాల్సిన ఎంఈడీ, ఎల్‌ఎల్‌బీ పరీక్షను మాత్రమే వాయిదా వేశామన్నారు. 3వ తేదీ నుంచి పరీక్షలు యథాతథంగా నిర్వహిస్తామని తెలిపారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు సెలవును పాటించాలని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వరద ఉధృతి తగ్గేవరకు రాకపోకలు నిలిపివేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్సీ పవార్

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 1: భారీ వర్షాల నేపథ్యంలో వాగులు, కాల్వలు, కల్వర్టులపై వరద ఉధృతి తగ్గేవరకు రాకపోకలు నిలిపివేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్రపవార్ అధికారులను ఆదేశించారు. మండలంలోని అమ్మనబోలు నుంచి భైరవునిబండకు వెళ్లే రోడ్డులో ఉన్న కల్వర్టుపై జాలకుంట నీరు పొంగి ప్రవహిస్తుండగా ఆదివారం పరిశీలించారు. వర్షం తగ్గితే వరద ఉధృతి కూడ తగ్గే అవకాశం ఉంటుందని, అప్పటివరకు రాకపోకలు నిలిపివేయాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ ఎల్. వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సుధాకర్, సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్, ఆర్ఐ తరుణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఆలంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్‌లోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో రేకుల షెడ్డు ద్వారా వర్షపు నీరు గదుల్లో కురుస్తుందని సమాచారం తెలుసుకున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదివారం పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆదివారం కావడంతో బాలికల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి గదుల్లో కురిసిన వర్షానికి తమ పిల్లలు ఇబ్బందులు పడ్డారని తల్లిదండ్రులు కలెక్టర్ దృష్టికి తేగా విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలోనకిరేకల్ స్పెషల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బాలయ్య, ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ జమీరొద్దీన్, ఏవో జాన్ మియా, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రవంతి ఉన్నారు.

నల్లగొండ టౌన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా తడిసిన పాత ఇళ్లు, మట్టి మిద్దెలు పడిపోయి ప్రాణహాని కలిగేందుకు అవకాశముందని, అలాంటి ఇళ్ల నుంచి ప్రజలను తక్షణమే ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. వర్షాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యుత్, తాగునీటికి ఇబ్బందులు ఏర్పడిన చోట ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



నార్కట్‌పల్లి: అమ్మనబోలు వద్ద జాలకుంట వరద పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఆరుగురిని రక్షించిన పోలీసులు

కోదాడ రూరల్, సెప్టెంబరు 1: కోళ్ల ఫామ్ షెడ్‌లో చిక్కుకున్న ఆరుగురిని పోలీసులు రక్షించారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పర్యవేక్షణలో ఏఎస్పీ నాగేశ్వరరావు బృందం వారిని కాపాడి సురక్షిత ప్రాంతానికి తరలించారు. మండలంలోని నల్లబండగుడెం శివారులోని ఓ కోళ్లఫామ్ షెడ్‌లో ఉన్న ఏపీ రాష్ట్రం గుడివాడకు చెందిన కూలీలు పనిచేస్తున్నారు. పాలేరు బ్యాక్ వాటర్ ఉధృతికి నల్లబండగూడెంలోని కోళ్లఫామ్ షెడ్‌లోకి నీరు చేరింది. ఐదు అడుగుల మేర నీరు రావటంతో ఆరుగురు కూలీలు (ముగ్గురు మహిళలు, ఒక చిన్నారి, ఇద్దరు పురుషులు) మొదటి ఫ్లోర్‌పైకి ఎక్కి సహాయక చర్యల కోసం విన్నవించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మత్స్యకార్మికుల సహాయంతో వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. తమను కాపాడిన పోలీసులు, గ్రామస్థులు కూలీలు కృతజ్ఞతలు తెలిపారు. సహాయక చర్యల్లో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, కోదాడ రూరల్ సీఐ రజిత రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, ఎస్ఐ అనిల్, వీరాస్వామి, గురుస్వామి, వేలాద్రి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రేమ వేధింపులతో యువతి ఆత్మహత్య

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 1: ప్రేమ వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెల్లికట్టెలో ఆదివారం ఈ ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. తొర్రూరు మండలం వెలికట్టె గ్రామానికి చెందిన కొమ్ము శ్రీనివాస్-సుగుణ దంపతుల కుమార్తె కొమ్ము సౌమ్య (21) హైదరాబాద్‌లో ఓ రియల్ ఎస్టేట్ కార్యాలయంలో ఆరు నెలలుగా కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తుంది. ఈ క్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అలంపురం గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ నిర్వాహకుడు జిన్నమోని యాదగిరి ప్రేమిస్తున్నానని వేధిస్తున్నాడు. దీంతో మూడు రోజుల క్రితం తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. అయినా ఫోన్‌చేసి వేధిస్తుంటే శనివారం ఉదయం పురుగుల మందు తాగింది. గమనించిన తల్లిదండ్రులు తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా, పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ జి.ఉపేందర్ తెలిపారు.







యాదగిరీశుడికి
శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 1: యాదగిరిశుడికి నిత్యపూజలు ఆదివారం శాస్త్రోక్తంగా కొనసాగాయి. సుప్రభాత సేవతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ఆలయంలో హోమం, నిత్య కల్యాణపర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్ట స్వామి, అమ్మవారలకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపిన అర్చకస్వాములు ఉభయ ఆలయాల్లో రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.


కొండపై భక్తుల రద్దీ

లక్ష్మీ నరసింహ స్వామివారి దర్శనార్థం వచ్చిన ఆదివారం భక్తులతో యాదగిరికొండపై రద్దీ నెలకొంది. గత రెండు రోజులగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలు కురుస్తున్నా, వారాంతపు సెలవు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు సుమారు 20వేలమంది భక్తులు తరలివచ్చారు. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రతమండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో స్వల్పంగా భక్తులు ఉన్నారు. వర్షం తగ్గిన తర్వాత ఆలయ ఉత్తర దిశలో భక్తులు సెల్ఫీలు దిగారు. అదేవిధంగా భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.37,65,700 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

వర్షంతో భక్తుల ఇబ్బందులు

లక్ష్మీనరసింహస్వామివారి దివ్యక్షేత్రంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది.రాష్ట్ర నలుమూలల నుంచి ఇష్టదైవాలను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు ఇబ్బందులకు గురికాగా నిరంతరంగా కురుస్తున్న వర్షంలోనే భక్తులు దేవదేవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఉత్తర దిక్కులో ఏర్పాటు చేసిన షెడ్ మినహా కొండపైన తలదాచుకునేందుకు ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఎప్పటిలాగే ఇబ్బందులు తప్పలేదు. చంటిపిల్లల తల్లులు, చంటిపిల్లలు, వృద్ధులు కొంతమంది భక్తులు గొడుగుల సహాయంతో దర్శించుకోగా వర్షంలోనే మరికొంతమంది భక్తులు తడిసిపోయి ఇబ్బందులు పడ్డారు. తమవెంట తెచ్చుకున్న ప్రత్యామ్నాయ వస్త్రాలను కప్పుకొని స్వామిఅమ్మవారలను దర్శించుకున్నారు.









నాయికన్‌గూడెం రహదారిపై ప్రవహిస్తున్న నీరు

నీట మునిగిన వందల ఎకరాలు

- సాగర్ ఎడమ కాల్వకు రెండు చోట్ల గండి
- పాలేరు వెనుక జలాలతో పెరిగిన నీటి ఉధృతి
- గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించిన సీఈ రమేష్‌బాబు, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు

నడిగూడెం, సెప్టెంబరు 1: సాగర్ ఎడమకాల్వకు ఆదివారం రెండు చోట్ల గండి పడింది. పాలేరు రిజర్వాయర్ నుంచి బ్యాక్ వాటర్ ఉధృతి పెరగడంతో సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం వద్ద 132వ, 133వ కిలోమీటర్ల పరిధిలో రెండుచోట్ల 60 అడుగుల మేర గండి పడినట్లు అధికారులు గుర్తించారు. వర్షాల ప్రభావం తోడు ఎడమకాల్వలో నీటి ప్రవాహం అంచులను తాకుతూ ప్రవహిస్తున్నందున కాల్వకు గండిపడింది. ఈ భారీ గండికి ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం నాయికన్‌గూడెం పరిసర గ్రామాల పంట పొలాలు నీట మునిగాయి. బ్యాక్ వాటర్ ప్రభావంతో సిరిపురం డీప్‌కట్ వద్ద వంతెనపై నుంచి నీరు గ్రామంలోని ఇళ్లలోకి చేరింది. గండి పడిన ప్రదేశాన్ని ఎన్నెస్పీ సీఈ రమేష్‌బాబు, డీఈలు రఘు, రామకృష్ణ, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు పరిశీలించి ప్రమాదం ఏర్పడకుండా తక్షణ చర్యలు చేపట్టి సాగర్ ప్రాజెక్టు ద్వారా నీటి విడుదల నిలిపివేశారు. ఎడమ కాల్వపై ఏర్పాటు చేసిన ఎక్స్‌కేప్ పని చేయనందున భారీ గండికి కారణంగా తెలుస్తోంది. కాల్వలో నీటి ప్రవహం అధికంగా ఉన్న సమయంలో అత్యవసరంగా నీటిని మళ్లించేందుకు ఎక్స్‌కేప్‌నుంచి నీటి విడుదల చేశారు. ఎడమకాల్వ పరిధిలో పలు చోట్ల ఎక్స్‌కేప్ ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణలోపం అధికారుల పర్యవేక్షణ లేనందున కాగిత రామచంద్రాపురం వద్ద గండి పడేందుకు కారణమైంది. గండి పడిన ప్రాంతంలో ఎక్స్‌కేప్ ఉండగా నాలుగు గేట్లు తెరుచుకోకపోవడంతో ప్రమాదం జరిగింది. ఎక్స్‌కేప్‌ల ద్వారా నీటి విడుదల జరిగితే ఉధృతి తగ్గి గండి పడేది కాదని రైతులు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం తోనే ఎక్స్‌కేప్ పని చేయనందున రెండు చోట్ల గండి పడి పంట పొలాలు నీట మునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నల్లగొండ జిల్లాలో 498ఎకరాల్లో నీట మునిగిన పంట

నల్లగొండ: నల్లగొండ జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో 498 ఎకరాల్లో వరి, పత్తి పంటలు మునిగి పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. వరి 475 ఎకరాల్లో నీట మునగగా, 20ఎకరాల్లో పత్తి, మూడు ఎకరాల్లో మిర్చిపంట నీట మునిగిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పి.శ్రవణ్ కుమార్ తెలిపారు.

దామచర్ల మండలంలోని వాడపల్లిలో వరి 100 ఎకరాల్లో, పత్తి 20 ఎకరాల్లో దెబ్బతిన్నదని, మాడ్గులపల్లి మండలంలోని కల్వలపాలెంలో 100 ఎకరాల్లో వరి నీట మునిగిందన్నారు. వేములపల్లి మండల కేంద్రంలో 100 ఎకరాల వరి, శెట్టిపాలెంలో 120 ఎకరాలు, రావులపెంటలో 150 ఎకరాల్లో వరి దెబ్బతిన్నదన్నారు. గుర్రంపోడు మండలంలో పాల్లపల్లిలో మూడు ఎకరాల్లో వరి, పెద్దవూర మండలం చలకుర్తిలో మూడు ఎకరాల్లో వరి నీట మునిగిందన్నారు. నీట మునిగిన పంట దెబ్బతిన్నదని ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు.



మోటకొండూరు మండలం దుర్శగానిపల్లి గ్రామంలో నేలకొరిగిన వరిచేను

మరో రెండు రోజులు భారీ వర్షాలు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



హుజూర్‌నగర్‌లో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న సూర్యాపేట జిల్లా కలెక్టర్

సూర్యాపేట (కలెక్టరేట్): వాతావరణ శాఖ వెల్లడించిన ప్రకారం మరో రెండు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలవల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వరద ప్రభావం ఎక్కువగా ఉన్న వంతెనల వద్ద ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. జిల్లా స్థాయిలో పర్యవేక్షణ కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏదైనా సమాచారం కోసం 6281492368 సంప్రదించాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హుజూర్‌నగర్: వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ కోరారు. పట్టణంలోని బైపాస్‌రోడ్డు, లింగగిరి రోడ్డు, దద్దనాల చెరువు లోతట్టు ప్రాంతాలను పరిశీలించి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. భారీ వర్షపాతం నమోదు కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హుజూర్‌నగర్ ప్రాంతంలోని తెగిపోయిన చెరువులు,కుంటలను పరిశీలించాలన్నారు. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కాల్వలను పరిశీలించారు. లైనింగ్ కొట్టుకపోగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షం వచ్చినప్పుడు అత్యవసరమైనప్పుడే ప్రజలు బయటకు రావాలని సూచించారు. ఆయనవెంట ఆర్డీవో శ్రీనివాసులు, దేవరం ప్రభాకర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, తుమ్మల శ్రీనివాస్, చంద్రశేఖర్, కమిషనర్ యాకూబ్‌పాషా, తహసీల్దార్ నాగేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో గండి పూడుస్తాం: కలెక్టర్

నడిగూడెం: సాగర్ ఎడమకాల్వపై కాగిత రామచంద్రాపురం వద్ద ఏర్పడిన గండి వారంరోజుల్లో పూడ్చేందుకు యుద్ధ ప్రతిపాదకన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఆదివారం సాగర్ ఎడమ కాల్వపై నడిగూడెం మండలం, కాగిత రామచంద్రాపురం వద్ద ఏర్పడిన గండిని పరిశీలించి అధికారులకు పలు సూచనాలు ఇస్తూ స్థానికులతో మాట్లాడారు. 25ఏళ్లుగా కురవని వర్షాలు రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజుల్లోనే కురిసి అతలకుతలం చేశాయన్నారు. సాధ్యమైన త్వరలో గండి పూడ్చి రైతులు సాగు చేసిన పంటలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సాగర్ ఎడమకాల్వకు గండి పడి వరదనీరంత గ్రామాల్లోకి చేరడంతో సిరిపురంతో పాటు ఇరత ముంపు గ్రామాలను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పరిశీలించారు. సిరిపురం డీప్‌కట్ వద్ద వంతెనపై నుంచి పారుతున్న నీటిని గ్రామంలోకి నీరు చేరగా ద్విచక్ర వాహనంపై పర్యటించి పరిస్థితిని తెలుసుకున్నారు.



నడిగూడెం మండలంలో గండి పడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నేడు మంత్రి పర్యటన

ఎడమకాల్వపై గండిపడిన ప్రదేశాన్ని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు గండి పూడ్చివేతపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామన్నారు.



బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిన తొగర్రాయి గ్రామం

జల దిగ్బంధం

- నీట మునిగిన తొగర్రాయి, కూచిపూడి
- ప్రజలతో సంబంధాలు తెగిపోయిన గ్రామాలు
- 20 ఇళ్లకు పైగా నేలమట్టం

కోదాడరూరల్, సెప్టెంబరు 1: సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు వాగులు, వంకలు, కుంటలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. అంతర్‌గంగా వాగు ఉధృతంగా ప్రవహించటంతో తొగర్రాయి, కూచిపూడి గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ రెండు గ్రామాల రహదారులు కొట్టుకుపోవటంతో ప్రజలతో సంబంధాలు తెగిపోయాయి. గ్రామాల చుట్టూ అంతర్ గంగా వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. వరద నీరు ఇళ్లలోకి చేరి 20 ఇళ్లకు పైగా నేలమట్టమయ్యాయి. విద్యుత్ స్తంభాలు కొట్టుకుని పోగా.. 500ఎకరాలకు పైగా వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరద ఉధృతికి కొట్టుకుని పోయి పంట పొలాలకు ఇసుక మేట వేసింది. నాలుగు ఎకరాల్లో తాము వేసిన వరి పంటపై ఇసుక మేటవేసి తీవ్ర నష్టం జరిగిందని రైతు వేనేపల్లి నాగేశ్వరరావు తెలిపారు. ఇళ్లలో వంట సామగ్రి, బియ్యం, దుస్తులు, డబ్బులు, బంగారం, సైతం నీటి ప్రవాహంలో కొట్టుకు పోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. కట్టుబట్టలతో మిగిలిపోయామని వారు తెలిపారు. ఇంత పెద్దఎత్తున వరదరావటం ఎప్పుడూ చూడలేదన్నారు. శనివారం సాయంత్రంనుంచి వర్షం బీభత్సం ఎక్కువైందన్నారు. పక్కన ఉన్న చిలుకూరు మండలంలోని చిలుకూరు, నారాయణపురం, సీతారామాపురం, గ్రామాలకు చెందిన చెరువులు పూర్తిస్థాయిలో తెగిపోవటంతో అంతర్‌గంగా వాగు ప్రమాదస్థాయికి మించి ప్రవహించిందని గ్రామస్తులు పేర్కొన్నారు. తొగర్రాయి బ్రిడ్జిపై పది అడుగుల మేర నీరు ప్రవహించటంతో కోదాడ, మేళ్లచెర్వు రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ వరద ఉధృతిలో రెండు కార్లు, రెండు బైక్లు, ట్రాక్టర్లు కూడా కొట్టుకుని పోయాయని తొగర్రాయి గ్రామస్థులు తెలిపారు.

భార్య భర్తలను కాపాడిన గ్రామస్థులు

శనివారం రాత్రి మేళ్లచెర్వు వైపు నుంచి కోదాడ వెళుతున్న కారు తొగరాయి వద్ద వరద ఉధృతి సందర్భంగా బ్రిడ్జిపై నిలిచిపోయింది. నీటి ప్రవాహం క్రమంగా పెరగటంతో రోడ్డుపై ఉన్న కారు సైతం నీటి ప్రవాహంలో కొట్టుకపోయింది. కారులో ఉన్న భార్యభర్తలు వరద ప్రవాహం నుంచి చిన్నగా బయటకు వచ్చి చెట్టును పట్టుకొని నిలుచున్నారు. ఇది గమనించిన గ్రామస్థులు వెంటనే వారిని తాళ్ల సహాయంతో బయటకి తీసుకువచ్చారు. మరో కారు కూడా వరద ప్రవాహం కొట్టకపోవడంతో కారులో ఉన్న వ్యక్తి బయటకు దూకి ప్రాణాలు దక్కించుకున్నాడు.



హాలియా మండలంలో సోమసముద్రం చెరువును పరిశీలిస్తున్న ఎస్ఐ

తిరుమలగిరి(సాగర్): భారీ వర్షాలతో నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని అన్ని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షం దాటికి పత్తి సాగు చేస్తున్న రైతుల పొలాల్లోకి వరద నీరు చేరింది. ఈ నీరు ఇలాగే నిల్వ ఉంటే పత్తి పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే పత్తిచేలో నిలిచిన నీటిని రైతులు తొలగించేలా తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మండలంలోని జోయగూడెంలో ఇల్లు కూలింది.

నిలిచిన రాకపోకలు

హాలియా: ఎడతెరిపి లేకుండా శనివారం కురిసిన వర్షంతో అనుముల మండలంలోని పేరూరు సోమసముద్రం చెరువు అలుగుపోస్తూ రోడ్డుపై ప్రవహిస్తుండడంతో హాలియా పట్టణానికి రావడానికి పేరూరు, వీర్లగడ్డతండా, ఆంజనేయతండా గ్రామస్థులకు రాకపోకలు నిలిచాయి. వారు హాలియాకు రావడానికి కొరివేనిగూడెం మీదుగా అల్వాల ఎక్స్ రోడ్డునుంచి వస్తున్నారు. సోమసముద్రం చెరువు అలుగు పోస్తున్న విషయం తెలుసుకున్న హాలియా ఎస్ఐ సతీష్‌కుమార్ అక్కడికి చేరుకొని గ్రామస్థులను అప్రమత్తం చేశారు.

సహకార సంఘం గోదాంలోకి వర్షపు నీరు

హుజూర్‌నగర్: పట్టణంలోని రెడ్డిబజార్‌లోగల సహకార సంఘం గోదాములోకి వరదనీరు చేరింది. దీంతో సుమారు రూ.30లక్షలు విలువ చేసే వివిధ రకాల ఎరువులు తడిసి ముద్దయ్యాయి. శనివారంరాత్రి కురిసిన భారీ వర్షానికి డ్రైనేజీలు, రోడ్లపై ప్రవహించిన నీరు గోదాములోకి ప్రవహించడంతో ఎరువులు మొత్తం తడిచిపోయాయి.

కూచిపూడి వాగులో కొట్టుకుపోయిన లారీలు



కోదాడ మండలంలో కొట్టుకుపోయిన లారీ

కోదాడ మండలంలోని కూచిపూడి గ్రామంలోని అంతర్ గంగ వాగు ఉధృతంగా ప్రవహించటంతో గ్రామంలో పెద్ద ఎత్తున ఆస్తినష్టం జరిగింది. గ్రామంలో బ్రిడ్జిపై ఉన్న నాలుగు అడుగుల మేర నీరు ప్రవహించటంతో కోదాడ, దొండపాడు రాకపోకలు నిలిచిపోయాయి. శనివారంరాత్రి బ్రిడ్జి దాటుతున్న రెండు లారీలు వాగులో కొట్టుకపోయాయి. లారీలో ఉన్న డ్రైవర్లు తాటి చెట్టును పట్టుకుని రాత్రి మొత్తం నీటి ప్రవాహంలోనే గడిపినట్లు డ్రైవర్ నాగరాజు తెలిపారు. గ్రామంలో 10కి పైగా ఇళ్లు నేలమట్టం కాగా.. వందల ఎకరాల వరి పంటకు తీవ్ర నష్టం జరిగింది. పశువైద్యశాల, సహకార సంఘం భవనం, పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. కూచిపూడి, తొగర్రాయి రహదారి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోవటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కలెక్టర్ తేజ్ నంద్‌లాల్, ఎంపీడీవో రామ్ చందర్‌రావు, ఎంపీవో రంగయ్య, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ అనిల్‌కుమార్‌రెడ్డితో పాటు జెడ్పీ సీఈఓ అప్పారావు వరద స్థాయి గ్రామాలను పర్యటించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,మంత్రి పొంగులేటి, సీఎస్

ఇబ్బందుల్లేకుండా చూడాలి

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

భువనగిరి అర్బన్, నల్లగొండ టౌన్, సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 1: కురుస్తున్న వర్షాలకు జిల్లా అధికారు లు , ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నా రు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఏ.శాంతికుమారి, డీజీపీ జితేందర్‌తో కలిసి కలెక్టర్ల తో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా జిల్లా యాంత్రాంగాలు తీసుకున్న చర్యలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రెండు రోజులు కూడా అంతే చొరవతో అధికారులు పనిచేయాలన్నా రు. రెవెన్యూ, పోలీసు శాఖలతో పాటు ఇతర శాఖల సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వర్షం, స్థానిక పరిస్థితులను బట్టి సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించాలన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పనిచేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టర్లు హనుమంతు కే. జెండగే, నారాయణరెడ్డి, తేజస్ నందలాల్ పవార్, నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవర్, సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, అదనపు కలెక్టర్లు కే. గంగాధర్, బీఎస్ లత ఉన్నారు.



మట్టపల్లి క్షేత్ర ప్రహరీని తాకిన వరద

ప్రమాదం అంచున మట్టపల్లి

మఠంపల్లి: కురుస్తున్న భారీ వర్షాలకు తోడు కృష్ణమ్మ ప్రవాహంతో సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి నృసింహ క్షేత్రం ప్రమాదం అంచులో ఉంది. ఎగువ నుంచి వస్తున్న వరదతో పాటు పులిచింతల ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి మట్టం చేరడంతో మట్టపల్లి ఆలయం వద్ద కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. గత మూడేళ్ల క్రితం నీటిలో మునిగిన స్వామివారు మళ్లీ అదే పరిస్థితి కనిపిస్తున్న ప్రభుత్వ తీరులో మాత్రం మార్పు రావడంలేదు. రూ.3కోట్లతో కరకట్ట నిర్మించిన మట్టపల్లి శ్రీలక్ష్మీ నరసింహుడికి వరద తాకిడి వదిలేలా లేదు. గత 2020 ఆగస్టు 12 నుంచి 26 వరకు మట్టపల్లి ఆలయం వరద ముంపునకు గురైంది. ప్రస్తుతం కృష్ణానదికి ఎగువ ప్రాంతం నుంచి భారీగా వస్తున్న వరదనీటితో ఆల య కరకట్ట లీకేజీ అయి గుడిలోకి నీరు చేరుతోంది. పుష్కర ఘాట్లు మునిగి అడుగుల మేర కరకట్ట నుంచి లీకేజీ అవుతున్న నీరు ఆలయంలోకి వస్తుండగా పాలక వర్గం వారు రెండు హైస్పీడ్ మోటార్ల ద్వారా ఎప్పటికప్పుడు నీటిని తోడెస్తున్నారు.

మఠంపల్లిలో భారీ వర్షం

మఠంపల్లిలో భారీ వర్షం కురిసింది. ఈ వర్ష బీభత్సవానికి అపార నష్టం జరిగింది. శనివారం రాత్రి 4గంటలు కురిసిన వర్షం మండలంలో అతలాకుతలమైంది. ఈ వర్షానికి సుమారు వెయ్యి ఎకరాల పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. మండలంలో మూడు చెరువులకు పలు చోట్ల గండి పడడంతో ఆయకట్టు కింద ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. మండలంలోని రఘునాథపాలెం, మఠంపల్లి ఎస్సీకాలనీ, చౌటపల్లి, గుర్రంబోడు తండాల్లో కాలనీలు వరద నీటి తో జలమయమైయ్యాయి.

భారీ వర్షాలతో పంటలకు నష్టం

కెవికె శాస్త్రవేత్త చంద్రశేఖర్ సూచనలు



వర్షం నీటిలో ఉన్న ప్రత్తి పంట, శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్

మిర్యాలగూడ (వ్యవసాయం): బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పత్తి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. పంటల్లో వర్షం నీరు నిలబడంతో నేలనుంచి పంటలకు పోషకాలు అందకపోవడంతో పంటలు ఎర్రబారి చనిపోతాయి. ఈ సమయం లో రైతులు చాలా అప్రమత్తంగా ఉండాలి. పంటల్లో అవసరమైన మేర సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు.

పత్తి పంటలో..

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పత్తిని 7.3లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 45-80 రోజుల దశలో పంట ఉంది. పంటల్లో నీరు నిలబడటంతో పంట దెబ్బతినే ప్రమాదం ఉంది.
- ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గిన తర్వాత 60-80 రోజుల వయస్సు ఉన్న పత్తిపంటకు ఎకరానికి 25 కిలోల యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రసాయన ఎరువులను పైపాటుగా మొక్కలమొదళ్లలో 7-10 సెం. మీదూరంలో పాదులు తీసి రసాయన ఎరువులను వేసి మట్టితో కప్పాలి.
- ముంపునకు గురైన పంట త్వరగా పంట కోలుకోవడానికి 19:19:19 లేదా 13-0-45 లేదా 10గ్రా. యూరియా లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేట్టు వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- నేల ద్వారా ఎండు తెగులు, వేరుకుళ్లు తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. నివారణకు లీటరు నీటికి కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా కార్బండిజమ్, మాంకోజెబ్ 2గ్రా. శిలీంద్రనాశిక మందును లీటర్ నీటికి కలిపి నేల బాగా తడిచేట్టు వారం వ్యవధిలో రెండుసార్లు మొక్క మొదళ్లలో పిచికారీ చేయాలి.
- అధిక వర్షాలతో గడ్డి ఇతర కలుపు మొక్కలు పెరిగే అవకాశం ఉన్నందున అంతర కృషికి వీలులేని పరిస్థితుల్లో పత్తి పంటలో వచ్చే గడ్డి జాతి, వెడల్పాకు కలుపు మొక్కలు నివారించడానికి (2-3ఆకుల దశలో ఉన్న కలుపు మొక్కలు) క్విజలోఫాస్ ఇథైల్+1.25 మి.లీ పైరిథాయోబ్యాక్ సోడియం కలుపు మందులను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- అధిక వర్షాలతో పత్తిలో శాఖీయ పెరుగుదల అధికమయ్యే అవకాశం ఉంది. విత్తిన 50-60 రోజులకు 80-90 రోజులకు పైనుంచి 1-2 అంచులను తుంచాలి. లేదా లీటరు నీటికి 1.0-1.2 మి.లీ మేపిక్వాట్ క్లోరైడ్‌ని కలిపి పిచికారీ చేయాలి. దీనివల్ల శాఖీయ పెరుగుదల నియంత్రించబడి దిగుబడి పెరిగే అవశాశం ఉంది.
- అధిక తేమవల్ల పత్తిలో పూత రాలడం గమనిస్తే ప్లానోఫిక్స్ 10 పీపీఎం మందును 5 లీటర్ల నీటికి 1 మి.లీ.ని కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.


కూరగాయల సాగులో..

- మొక్కలకు సరిపడా ఆకులు, కొమ్మలు ఉన్నట్లయితే లీటర్ నీటికి 3గ్రాముల మల్టీ-కే లేదా యూరియా 20గ్రా. లీటర్ నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- పడిపోయిన మొక్కలను నిలబెట్టి మట్టిని వేయాలి.
- ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కూరగాయ పంటల్లో ఆకుమచ్చ తెగులు, బూజు తెగులు వ్యాపించే అవకాశం ఉంది. తెగులు నివారణకు ముందు జాగ్రత్తగా లీటర్ నీటికి కాపర్- ఆక్సిక్లోరైడ్ 3గ్రా. కార్బెండిజమ్, మ్యాంకోజెబ్ 2గ్రా. శిలీంధ్రనాశిక మందును నేల బాగా తడిచేట్లు మొక్క మొదళ్లలో వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

మిరప పంటలో..

- భూమిలో ఉన్న మురుగు నీటిని తీసివేసి లీటర్ నీటికి యూరియా 10గ్రా.లు కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- మొక్కలు వాలిపోయినట్లు కనబడితే లీటర్ నీటికి 5గ్రా.ల మెగ్నీషియం సల్ఫేట్‌ను కలిపి పిచికారీ చేయాలి.
- వర్షం తగ్గాక పైపాటుగా ఎకరాకు 200కిలోల వేపపిండి 30కిలోల యూరియా 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ని వేసుకోవాలి.
- మురుగు నీరు పోయిన తర్వాత గొర్రుతో అంతరకృషి చేయాలి.

ప్రాజెక్టులకు జలకళ



కేతేపల్లి వద్ద మూసీ పరవళ్లు

నాగార్జునసాగర్, దామరచర్ల: ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు జలకళ సంతరించుకుంది. ఎగువ న కురుస్తున్న వర్షాలతోపాటు వరద ప్రవాహం పెరగడంతో నిండుకుండలా ప్రాజెక్టులు కన్పిస్తున్నా యి. దీంతో జిల్లావ్యాప్తంగా ప్రాజెక్టుల వద్ద పర్యాటకుల సందడి కన్పిస్తుంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువనుంచి 4,74,305 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ఆదివా రం సాయంత్రానికి 587.90 అడుగులుగా (305. 9818టీఎంసీలు)గా ఉంది. కుడికాల్వ ద్వారా 5292 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 12,261 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్ల నుంచి 4,97,524 క్యూసెక్కులు మొత్తంగా 5,16,877 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ 26 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో పర్యాటకుల రాక పెరిగింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎడమ, వరద కాల్వలకు నీటి విడుదలను నిలిపివేశారు. సాగర్ ఎడమ కాల్వకు సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామచంద్రపురం వద్ద గండి పడటంతో ఎడమకాల్వకు ప్రాజెక్టు అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా మాచర్ల మండలంలో ఉన్న ఎత్తిపోతల జలపాతానికి వరద ప్రవాహం పెరిగింది. దీంతో 70 అడుగుల ఎత్తు నుంచి కిందకు పడే ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించడానికి పర్యాటకులు ఆదివారం పోటెత్తారు.

టెయిల్‌పాండ్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

నాగార్జునసాగర్ నుంచి నీటి విడుదల జరుగుతున్న నేపథ్యంలో అడవిదేవులపల్లి మండలంలోని టెయిల్‌పాండ్ నుంచి దిగువ పులిచింతలకు ఆదివారం అధికారులు నీటిని విడుదల చేశారు. 16 గేట్లను 6.5 మీటర్లు, ఒక గేటును 2 మీటర్ల మేర ఎత్తి దిగువ పులిచింతలకు 5,38,467 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభినది

డిండి: రెండు రోజులుగా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు దుందుభినదికి వరద ప్రవాహం పెరగడంతో డిండి రిజర్వాయర్ నీటిమట్టం పెరిగింది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 36 అడుగులు (2.4 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 30 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 19వేల క్యూసెక్కులు ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. సోమవారం ఉదయానికి ప్రాజెక్టు నీటిమట్టం గరిష్టస్థాయికి చేరుకొని అవుట్‌ఫ్లో అవుతుందని ఈఈ శ్రీధర్‌రావు తెలిపారు.

సూర్యాపేటరూరల్: మూసీ ప్రాజెక్టుకు 10వేల క్యూసెక్కుల వరద నీరు రావడంతో 2, 3, 7, 8 క్రస్ట్ గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 13వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారం ఉదయం 10వ గేటును కూడా ఎత్తారు. ప్రస్తుతం ప్రాజెక్టు 2, 3, 7, 8, 10 క్రస్టు గేట్లను నాలుగు అడుగుల మేర ఎత్తి 12,270 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

మేళ్లచెర్వు: పులిచింతల ప్రాజెక్టు రికార్డు స్థాయిలో 6,41,250 క్యూసెక్కుల వరద నీరు ఎగువ నుంచి చేరుతుంది. శనివారం సాయంత్రం 2,71,202 క్యూసెక్కులుగా ఉన్న వరదనీరు శనివారం రాత్రి 11 గంటలకు 4లక్షల క్యూసెక్కులకు చేరుకోగా.. ఆదివారం ఉదయం ఒంటి గంటకు 5లక్షలకు చేరుకున్న వరద నీరు ఆరు గంటలకు 6,02,894 క్యూసెక్కులుగా నమోదు కాగా, ప్రాజెక్టు 18 గేట్ల ద్వారా 5,79,591 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా ఆదివారం సాయంత్రానికి 6,36,945 క్యూసెక్కులుగా ఇన్‌ఫ్లో ఉండగా.. 21 గేట్ల ద్వారా 6,02,310 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

శాలిగౌరారం: జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి నీరు భారీగా వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులుకు ప్రస్తుతం 16అడుగులు చేరడంతో జలకళను సంతరించుకోవడం ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం



కొండమల్లేపల్లిలో అంబేడ్కర్ కాలనీలో ఇళ్ల మధ్యన వర్షపు నీరు

● జలమయమైన లోతట్టు ప్రాంతాలు ● అలుగుపోస్తున్న చెరువులు ● పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు ● నీట మునిగిన పంట పొలాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగుల నుంచి వచ్చే భారీ వరద ఆయా గ్రామాల్లోని చెరువుల్లోకి చేరడంతో అవి నిండుకుండను తలపిస్తున్నాయి. ఈ క్రమంలో వర్షాలు రాకముందు నీళ్లు లేక వెలవెలబోయిన చెరువుల్లో వరద నీటితో పొంగిపొర్లుతూ అలుగుల మీదుగా పారుతున్నాయి. దీంతో చెరువుల ఆయకట్టు రైతులు, మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పలు కాలనీలు కుంటలను తలపించాయి. మరికొన్ని చోట్ల ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షపు నీళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పలు గ్రామాల్లోని వరి, పత్తి పంట నీరు వచ్చి చేరింది. పలు చోట్ల వాగులు రోడ్లపై ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. తెగిన రోడ్డు మీదగా వాహనదారులు వెళ్లకుండా ముళ్ల కంపలు వేసి గ్రామస్థులు గ్రామానికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. ప్రజలు నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రదేశాల్లో నీటిలోకి దిగకుండా ఉండాలని హెచ్చరించారు. ప్రజలు వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు. కృష్ణాపరివాహక ప్రాంతమైన వైజాగ్‌కాలనీ, ఏఎమ్మార్పీ కాల్వ, డిండి ఆయకట్టులో చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేశారు.

● **దేవరకొండ:** దేవరకొండ డివిజన్‌లోని చందంపేటలో 154 మిల్లీమీటర్లు, కొండమల్లేపల్లిలో 138 మిల్లీమీటర్లు, దేవరకొండలో 120 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండలంలోని మంగలోని బావి గ్రామం వద్ద రోడ్డుకు ఇరువైపులా చెట్లు కూలీ రాకపోకలకు అంతరాయం కలగడంతో దేవరకొండ ఎస్‌ఐ రమేష్ ఆధ్వర్యంలో అధికారులు చెట్లను తొలగించారు. ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో శ్రీరాములు తెలిపారు. పట్టణంలోని జంగాల కాలనీలోని ఒక కుటుంబాన్ని టీటీడీ కల్యాణ మండపానికి తరలించి సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు.

● **తిప్పర్తి :** మండల పరిధిలోని మామిడాల, శేషమ్మగూడెం, కాశీవారిగూడెం గ్రామాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కాశీవారిగూడెం గ్రా మానికి వెళ్లే దారిలో వరద ఉధృతికి రోడ్డు తెగిపోవడంతో డీఎస్పీ కె. శివ రామ్‌రెడ్డి, ఎస్‌ఐ రాజుతో కలిసి పరిశీలించారు.

● **కట్టంగూరు:** మండలంలోని ఎర్రసానిగూడెం, కట్టంగూరు, కుమ్మరిగూడెం వద్ద గ్రామాలకు వెళ్లే వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కట్టంగూరు నుంచి నల్లగొండకు వెళ్లే రహదారిలో శనివారం రాత్రి చెట్టు విరిగి అడ్డంగా పడింది. ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావు, కార్యదర్శి అశోక్‌తో పా టు పలువురు కలిసి చెట్టును స్థానికుల సహాయంతో తొలగించారు.

● **వేములపల్లి:** మండలంలో 163.3మి.మీ వర్షపాతం నమోదైంది. లక్ష్మీదేవిగూడెం వద్ద వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో బీమారం- సూర్యాపేట రహదారిపై రాకపోకలు నిలిచిపోగా అటుగా వెళ్లే వాహనాలను పాములపాడు మీదుగా సూర్యాపేటకు మళ్లించారు. మరోవైపు తోపుచర్ల, వేములపల్లి, కుక్కడం చెరువులకు భారీగా వరద వచ్చి చేరడంతో చిత్రపరక వాగు సైతం ఉధృతంగా ప్రవహిస్తుంది. శెట్టిపాలెం గ్రా మంలో రహదారిపై భారీ చెట్టు రోడ్డుపై పడగా వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

● **చందంపేట:** డిండి దుందుభినది ఉద్రిక్తంగా ప్రవహిస్తుందని ప్రజలు అప్రమత్తంగా తహసీల్దార్ శ్రీనివాస్ కోరారు.

● **కొండమల్లేపల్లి:** మండలంలో పలు కాలనీలు కుంటలను తలపించాయి. మరికొన్ని చోట్ల ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అంబేడ్కర్ కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇళ్లలోకి వర్షపు చేరగా నిత్యావసర సరుకులు, సామగ్రి తడిసిపోయాయి. ఇళ్లలోకి చేరిన నీటిని బయటికి ఎత్తిపోస్తూ కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. డబుల్ బెడ్రూం ఇళ్లకు ఏర్పాటు చేసిన సెప్టిక్ ట్యాంక్ నిండి కాలనీ రోడ్లపై రావడంతో దుర్వాసన వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. గుమ్మడవెల్లి గ్రామంలో భారీ వర్షాలకు ఓ పాత ఇంటి గోడ కూలడంతో పాటు ఎంజీఆర్ కాలనీలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. ఆయా ప్రాంతాలను ఎంపీడీవో రాంరెడ్డి పరిశీలించి పలు సూచనలు చేశారు.

● **డిండి:** డిండి వాగు పరివాహక ప్రాంతంలో రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు ఈఈ శ్రీధర్‌రావు తెలిపారు.

● **మాడ్గులపల్లి:** మండలంలో భారీ వర్షాలకు చెక్ డ్యామ్‌లు, చెరువులు పొంగి పొర్లుతున్నాయి. దీంతో కల్వలపాలెం చెరువు ఉధృతంగా ప్రవహించడంతో పంటపొలాలు నీట మునిగాయి. అదేవిధంగా రోడ్లు తెగి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. చెరువుపల్లి గ్రామ చెరువును చంద్రం ఫౌండేషన్ చైర్మన్, తిప్పర్తి మాజీ జడ్పీటీసీ తండు సైదులుగౌడ్ పరిశీలించారు.

● **మిర్యాలగూడ:** పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన షాబూనగర్, సుం దర్‌నగర్, తాళ్లగడ్డ, బంగారుగడ్డ, సీతారాంపురం, ఇందిరమ్మ కాలనీలు జలమయమయ్యాయి. ఆర్టీసీ బస్టాండు, షాబూనగర్, తాళ్లగడ్డ ప్రభుత్వ పాఠశా ల ప్రాంగణాలు వర్షపు నీటితో నిండాయి. ఇక విద్యుత్ కార్యాలయం, సబ్‌స్టేషన్‌లలో వరదనీరు చేరడంతో వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు.

● **దామరచర్ల:** దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల్లో ఎడతెరపి లేని కురిసిన వర్షానికి పలుచోట్ల రోడ్లపైకి నీరు చేరింది. మండల కేంద్రంలోని జాన్‌పహాడ్ రోడ్డులోని కల్వర్టుపై నుంచి సుమారు అడుగు మేర నీరు ప్రవహించింది. అదే ప్రాంతంలోని సుమారు 20ఎకరాల మేర పంట పొలాలు నీట మునిగాయి. వీరభద్రపురం గ్రామంలోని రోడ్లపైకి నీరు చేరుకోవడంతో ఎక్సకవేటర్ సహాయంతో గండికొట్టి నీటిని దిగువకు విడుదల చేశారు. దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం గ్రామ శివారులో సుమారు 20 ఎకరాల మేరా పంట పొలాలు నీట మునిగాయి. వాడపల్లిలోని కృష్ణా, మూసీ నదుల సంగమం ప్రదేశంలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు సూచించారు.

● **తిరుమలగిరి(సాగర్):** మండలంలోని పెద్దచెరువు, కొంపెల్లి, చిలకాపురం, రాజవరం, అల్వాల చెరువులు పూర్తిగా నిండాయి. హాలియా మీదుగా పారే పెద్దవాగు మండలంలోని డొక్కలబాయి తండా వద్ద ఉధృతంగా ప్రవహిస్తూ టెయిల్‌పాండ్ బ్యాక్‌వాటర్‌లో కలుస్తుంది. మండలంలోని బోయగూడెం గ్రామంలో మెండె ఎల్లమ్మ రేకుల ఇల్లు కూలిపోయింది. దీంతో వంట సామగ్రి, బియ్యం తదితర వస్తువులు ధ్వంసమయ్యాయని పేర్కొంది. దీని వల్ల సుమారు రూ2.లక్షల మేర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేసింది.

● **కనగల్:** కనగల్ వాగులో వర్షపు నీటి ప్రవాహం కొనసాగుతుంది. కనగల్ ఖ త్వా అలుగుపోస్తుంది.

● **శాలిగౌరారం:** మండలంలో 16 సెంటీమీటర్లు వర్షం కురిసింది. గండికుంట, అడ్లూర్, కొత్తపెల్లి, రామానుజపురం కుంటలు అలుగుపోస్తున్నాయి.

● **రామగిరి:** నల్లగొండ పట్టణంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నల్లగొండ మునిసిపల్ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ ముసాబ్ అహ్మద్‌తో పాటు, సిబ్బంది పాతబస్తీ, మోతికుంట, గంధవారిగూడెం, చైతన్యపురి కాలనీ, ప్రకాశంబజార్ వివిధ ప్రాంతాలను పరిశీలించారు. అదేవిధంగా పాతబస్తీలో శిథిలావస్థలో ఉన్న భవనంలో ఉన్న ఇద్దరిని గుర్తించి వారిని షెల్టర్ ఫర్ హోమ్‌లెస్ గృహానికి తరలించారు. ఈ కారక్రమంలో ఏఈ దీలీప్, అధికారులు పాల్గొన్నారు.

● **మునుగోడు:** మండల కేంద్రంలోని 9వ వార్డులో ఎగువ నుంచి వచ్చే వరద నీరు నివాసాల మధ్యన నిలిచిపోయాయి. 2వ వార్డులోని పలు నేత కార్మికుల ఇళ్లలో నీరు ఉబికి వచ్చి మగ్గాలు నీట మునిగాయి. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

● **నాగార్జునసాగర్:** నందికొండ మునిసిపాలిటీలోని కాలనీల్లో చెట్లు విరిగి పడ్డాయి. వాటిని కమిషనర్ శ్రీను మునిసిపల్ సిబ్బందితో తొలగించారు. ఎక్కడైన పాత ఇళ్లు ఉంటే ఖాళీ చేయాలని విద్యుత్ స్తంభాలను తాకవద్దని ఆయన సూచించారు.

● **కేతేపల్లి :** కేతేపల్లి మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పలు గ్రామాలు అతలాకుతలమయ్యాయి. వర్షం, గాలి ధాటికి మండల వ్యాప్తంగా 20విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. కేతేపల్లిలోని జపమాల మాత చర్చి, సెయింట్ ఎలిజబెత్ ప్రాథమికోన్నత పాఠశాల, ప్రభుత్వ జడ్పీ పాఠశాలల ఆవరణలోని భారీ వృక్షాలు కూకటి వేళ్లతో సహా కూలిపోయాయి. 65వ నెంబర్ జాతీయ రహదారి వెంట హరితహారంలో నాటిన చెట్లు రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. మండలంలో ఆరు నివాస గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 8 విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో ఏఈ గాబ్రియెల్ పర్యవేక్షణలో 15 మంది సిబ్బంది శ్రమించి యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు పూర్తి చేశారు. కేతేపల్లిలో నివాస గృహాలు దెబ్బతిన్న బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే వీరేశం పరామర్శించారు. వర్ష తీవ్రతతో స్థానికంగా నెలకొన్న పరిస్థితులపై తహసీల్దార్, ఎంపీడీవోలతో సమీక్షించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నల్లగొండ ఆర్డీవో రవి పర్యటించారు.



కేతేపల్లిలో గాలి ఉధృతికి విద్యుత్ తీగలపై కూలిన చెట్లు



అలుగుపోస్తున్న కనగల్ ఖత్వా



వేములపల్లి: శెట్టిపాలెం వద్ద చిత్రపరక వాగు ప్రవాహానికి నీట మునిగిన పంటలు



దేవరకొండ: తాటికోలు వాగు ఉధృతిని పరిశీలించి పలు సూచనలు చేస్తున్న ఎంపీడీవో నీలిమ

విద్యారంగాన్ని గాలికి వదిలేసిన ప్రభుత్వం

రామగిరి, సెప్టెంబరు 1: విద్యారంగాన్ని ప్రభుత్వం పూర్తిగా గాలి కి వదిలేసిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ ఆరోపించారు. పట్టణంలో నిర్వ హిస్తున్న ఏబీవీపీ రాష్ట్ర స్థాయి ముగింపు సమావేశంలో ఆదివారం ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల ఆకాంక్షల మేరకు పనిచేస్తామని రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం అప్రజాస్వామిక, నిరంకుశత్వ పాలనతో అధోగతి పాలైందని అన్నారు. ఆ సంగతి కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించుకోవాలని ఆమె హెచ్చరించారు. విద్యార్థులు, ప్రజలు మార్పు కోరుకొని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొస్తే ఈ ప్రభుత్వం కూడా అదేవిధంగా వ్యవహరిస్తుందన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి 6.5 శాతం బడ్జెట్ కేటాయించడాన్ని చూస్తే విద్యారంగంపై ఎంత చిత్తశుద్ధి ఉందో అవగతం అవుతుందన్నారు. గత నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక ఎంతోమంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నల్లగొండ విభాగ్ ప్రముఖ్ కత్తుల ప్రమోద్‌కుమార్, విభాగ కన్వీనర్ మణికంఠ, జిల్లా కన్వీనర్ అవుల సంపత్‌కుమార్, నాయకులు శివకృష్ణ, జయేంద్ర, గోపిచంద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెద్దవూర, సెప్టెంబరు 1: రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ అన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం ఆదివారం మండలకేంద్రంలోని పలు వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ హాస్టళ్లలో పరిశుభ్రత పాటించాలని, నీటి నిల్వ, చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంటఎంపీడీవో ఉమాదేవి, స్థానిక అధికారులు ఉన్నారు.

సమాజసేవకు క్లబ్‌లు ఎంతో దోహదం

నల్లగొండటౌన్, సెప్టెంబరు 1: సమాజానికి జ్ఞాన నైపుణ్యాలు అందించడానికి, సమాజానికి సేవ చేయడానికి క్లబ్బులు ఎంతో దోహదపడుతాయని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్స్ రీజినల్ ప్రెసిడెంట్ నూనె సుదర్శన్, నేషనల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ సోను అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్స్ ఇన్స్టాలేషన్ కార్యక్రమంలో 15 క్లబ్బులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్ని క్లబ్బులు ఒకే సారి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు జ్ఞాన నైపుణ్యాలు పంచుతూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నేషనల్ సెక్రటరీ రామచంద్రుడు, లీగల్ ఇన్‌చార్జి జానకిరామరాజు, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ వెంకట్రావు, డైరెక్టర్లు డాక్టర్ మట్ట చెన్నయ్యగౌడ్, కోటా సరిత, కోఆర్డినేటర్లు గూడూరు అంజిరెడ్డి, కోట్ల సాయి కిరణ్, కవిత, క్లబ్బుల ప్రెసిడెంట్లు, సెక్రటరీలు ట్రెజరర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

నల్లగొండ స్పోర్ట్స్, సెప్టెంబరు 1: రాష్ట్ర స్థాయిలో జరిగే యోగా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిం చి రాణించాలని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుంభం నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా యోగా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో కూడా గెలుపొంది జిల్లాకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా యోగా ఎంపిక పోటీలు జరిగాయి. గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయిలో 7,8వ తేదీల్లో రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగే పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి నంద్యాల రాజశేఖర్‌రెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

సబ్ జూనియర్ బాలుర విభాగంలో బి.శ్రీహన్స, ఎం.వేదాంత్, సీహెచ్. అభిరాం, సీహెచ్.హర్షిత్, బాలికల విభాగంలో జి.అభిలాష్, బి.అశ్విని, ఎం.హైనాందవి, సహర్షనిధి, కె.చిద్విలాస్య, జూనియర్ బాలికల విభాగంలో జి.వైష్ణవి, ఎల్.పూజ, టి.మౌనిక, కోమల, వైష్ణవి, అనూష, సీనియర్స్ మహిళల విభాగంలో ఎన్.మనీష, ఇందిర, పురుషుల విభాగంలో శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ ఎంపికయ్యారు.

సూక్ష్మకళ రంగంలో రాణిస్తున్న విద్యాధరచారి

చింతపల్లి, సెప్టెంబరు 1: సూక్ష్మకళ రంగంలో తన ప్రతిభ చాటిన మండలం అంగడికుర్మపల్లి గ్రామానికి చెందిన ముంజంపల్లి విద్యాధరచారికి అవార్డు అందుకున్నారు. సూక్ష్మకళ రంగంలో విశేష కళాఖండాలను రూపొందించిన విద్యాదరచారికి వేద ధార్మిక సేవ సమితి ఆధ్వర్యంలో ఇటీవల్ల హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో సంస్థ చైర్మన్ కొండపాక కృష్ణామాచారి బహుమతిని అందజేశారు.

ఆపదకాలం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యేలు

మిర్యాలగూడ, నకిరేకల్, దేవరకొండ, సెప్టెంబరు 1: భారీ వర్షాలకు వరద నీటితో పోటెత్తుతున్న వాగులు, నాలాలతో ఆపద సంభవించే అవకాశం ఉందని అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, నేనావత్ బాలునాయక్ కోరారు. ఆదివారం నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, మరో 72 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆయన ఆదేశించారు.

● మిర్యాలగూడలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మునిసిపల్ కమిషనర్ ఎండి.యూసుఫ్, తహసీల్దార్ హరిబాబులతో కలిసి పట్టణంలోని లోతట్టు కాలనీల్లో పర్యటించారు. వరద నీరు ఇళ్లలోకి చేరిన షాబునగర్, తాళ్లగడ్డ, బంగారుగడ్డ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. వరద ముంపునకు గురైన కాలనీవాసులతో మాట్లాడి వారి ఇబ్బందులను తొలగించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మ్యాన్‌హోల్స్, కరెంట్ తీగలు తెగిపడి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో సీఐలు కరుణాకర్, నాగార్జున, ఎంపీడీవో శేషగిరిశర్మ, ఆర్ఐలు రామకృష్ణ, సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, పట్టణ కౌన్సిలర్లు, బీఎల్ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో ముంపు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్



నకిరేకల్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

● నకిరేకల్ మునిసిపాలిటీ పరిధిలోని వరద ప్రభావిత వార్డులలో ఎమ్మెల్యే వేముల వీరేశం పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరద నీరు విపరీతంగా వస్తున్న ప్రాంతాల్లో రోడ్లపై గుంతలు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పన్నాల రాఘవరెడ్డి, మురారిశెట్టి కృష్ణమూర్తి, చౌగోని శ్రీను, యాసారపు వెంకన్న, పలువురు కౌన్సిలర్లు ఉన్నారు.

● మూడు రోజులపాటు భారీ వర్షాలు ఉన్నందున దేవరకొండ నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బాలునాయక్ కోరారు. కృష్ణా పరివాహక ప్రాంతం వైజాగ్‌కాలనీ మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దన్నారు. అధికారులను అప్రమత్తం చేశామని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు.

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

● నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం సెప్టెంబర్ 1: రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని నల్లగొండ డీఎస్పీ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్‌శాఖ తరపున ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు విగ్రహాల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు తీసుకోవాలన్నారు. వినాయక విగ్రహాల ఏర్పాటు కోసం నిర్వాహకులు సంబంధిత పోర్టల్‌లో అన్ని వివరాలు పొందుపరిచి అప్లికేషన్ సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని సూచించారు. నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వినాయక చవిత ఉత్సవాలకు మునిసిపాలిటీ తరుపున అన్ని వసతులు కల్పిస్తామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఐలు డానియల్‌కుమార్, వేమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, క్రాంతికుమార్, ఎస్ఐలు, మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, పీస్ కమిటీ సభ్యులు గోలి మధుసూదన్‌రెడ్డి, కర్నాటి విజయ్‌కుమార్, గుమ్మల మోహన్‌రెడ్డి, నూకల నర్సింహారెడ్డి, నాగం వర్షిత్‌రెడ్డి, ఖలీం, ఖాన్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

మునుగోడు: గ్రామాల్లో ప్రజలకు విషజ్వరాలు, చికెన్ గున్యా, డెంగ్యూ వంటి వివిధ వ్యాధులు సోకకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కట్ట లింగస్వామి డిమాండ్ చేశారు.

నార్కట్‌పల్లి: సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చెరుకు పెద్దులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కట్టంగూరు, శాలిగౌరారం : కట్టంగూరు, శాలిగౌరారం మండలకేంద్రాల్లోని కేజీబీవీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న వంట మనిషి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో నాగయ్య తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 3వ తేదీలోపు కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తు అందజేయాలని ఆయన సూచించారు.

చిట్యాల: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ పార్లమెంటరీ ప్రభారీ వెంకట్‌నారాయణరెడ్డి కోరారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాల్లో పురోగతి చెందుతుందన్నారు.

నల్లగొండ కల్చరల్: మాస శివరాత్రి సందర్భంగా పట్టణంలోని తులసీనగర్‌లోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలోని శివాలయంలో శివలింగానికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. అంతేకాకుండా శ్రీవిశాలక్షి సహిత కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకస్వాములు రాత్రి వైభవంగా నిర్వహించారు. భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వేములపల్లి: రుణమాఫీకి అర్హులై మాఫీ పొందని రైతులు సంబంధిత పత్రాలతో గ్రామానికి వచ్చి న వ్యవసాయాధికారులకు తమ కుటుంబసభ్యుల వివరాలను అందించి వివరాలను నమోదు చేయించుకోవాలని ఏవో రుషేంద్రమణి అన్నారు.

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని మద్దెలమ్మతల్లి దేవాలయం నుంచి యాదవసంఘం ఆధ్వర్యంలో బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు తీసుకొచ్చి మద్దెలమ్మతల్లికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కేతేపల్లి: గ్రామీణ పండగలు తెలంగాణ సంస్కృతికి నిదర్శనాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని గుడివాడ గ్రామంలో శ్రీకంఠమహేశ్వరస్వామి సురమాంబల కల్యాణానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వనదేవతలకు బలిప్రదానం, సహపంక్తి భోజనాల కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు వేడుకలకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, టీపీసీసీ నాయకుడు దైద రవీందర్ హాజరయ్యారు.

నకిరేకల్: మండలంలోని గోరెంకలపల్లి గ్రామంలో బోనా ల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ముత్యాలమ్మ దేవతకు మహిళలు బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వీరార్జున్ రెడ్డి, చెట్టిపల్లి భాస్కర్, జాజుల నాగయ్య పాల్గొన్నారు.

కనగల్: దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ అభిషేక పూజలు, మొక్కుబడి కల్యాణాలను నిర్వహించారు.

అభివృద్ధికి 4 వేల కోట్లు మంజూరు చేయించాలి

● మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

కనగల్, సెప్టెంబరు 1: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద పలుకుబడి ఉందని చెప్పుకుంటున్న మంత్రి వెంకట్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం నాలుగు వేల కోట్లను మంజూరు చేయించాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కనగల్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో నల్లగొండ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా తాను 1350 కోట్లను మంజూరు చేయించి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు నత్తనడకన నడుస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటున్న రైతు రుణమాఫీ 40శాతం మందికే అందిందని అన్నారు. నల్లగొండ - దేవరకొండ రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా మార్చాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, పాలకూరి సైదులు, వేముల నరహరి, దోమలపల్లి యాదగిరి, నక్కల రమేష్, రాయల గిరి, మదు, శంకర్, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

● జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 1: ఉద్యోగులను అభద్రతకు గురి చేస్తున్న సీపీఎస్, ఎన్‌పీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి డిమాండ్ చేశారు. పించన్ విద్రోహ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలో నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, గెజిటెడ్ ఉద్యోగులు, పెన్షనర్స్, ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఓపీఎస్ విధానం అమలుపై భవిష్యత్తులో ఉద్యోగులందరూ నిరసన చేపట్టేందుకు వెనక్కి తగ్గబోమన్నారు. ఉద్యోగుల ఆవేదనను అర్థం చేసుకొని ఉద్యోగులకు వారి కుటుంబానికి ఆర్థిక భరో సా, ఆర్థిక భద్రతగా ఉండే పాత పించన్ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో టీఎన్జీవోస్ సెక్రటరీ జె. శేఖర్‌రెడ్డి, సెంట్రల్ వై స్ ప్రెసిడెంట్ నరసింహచారి, ఈసీ సభ్యుడు వంగూరి విజయకృష్ణ, రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, జిల్లా సెక్రటరీ శ్రీశైలం, జేఏసీ సెక్రటరీ జనరల్ ముజీ బ్, వివిధ సంఘాల నాయకులు వెంకట్రాంరెడ్డి, రాంబాబు, రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, ఎడ్ల సైదులు, వెంకటేశం, శేఖర్‌రెడ్డి, అరుణ, సోమనాధం తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

మూడు గుండ్లపై దర్శనం నిలిపివేత

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 1: నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలోని మూడు గుండ్లపై గల శివలింగం దర్శనం నిలిపివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో శివలింగ దర్శనం నిలిపివేడంతో పాటు గుట్టపైకి ఎలాంటి వాహనాలను అనుమతించడం లేదని ఆయన తెలిపారు. ఈ నెల 2వ తేదీన అమవాస్య సందర్భంగా గుట్టకు వచ్చే భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

సాగర్ కాల్వలో జారిపడి మహిళ మృతి

నిడమనూరు, సెప్టెంబరు 1: నాగార్జునసాగర్ ఎడమ కాల్వలో ప్రమాదవశాత్తు కాలు జారిపడి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన నిడమనూరు మండలం వేంపాడ్ వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడకు చెందిన జిల్లేపల్లి రాములమ్మ (61) అనే మహిళ మండలంలోని వెంగన్నగూడెం గ్రామంలోని తన చిన్నాన్న కటారి సత్యమయ్యకు ఆరోగ్యం బాగలేకపోవడంతో పరామర్శించడానికి వచ్చింది. ఈ క్రమంలో ఆమె ఆదివారం మధ్యాహ్నం మిర్యాలగూడకు తిరిగి వెళ్తుండగా కాళ్లు, చేతులు కడుక్కునేందుకు వేంపాడ్ వద్ద ఉన్న నాగార్జునసాగర్ ఎడమకాల్వలోకి దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కాల్వలో పడిపోయింది. కాల్వలో చేపలు పడుతున్న కొందరు వ్యక్తులు మహిళ కాల్వలో పడిన విషయాన్ని గమనించి కాల్వలోకి దూకి ఆమెను బయటకు తీసి కాపాడేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలు రాములమ్మ భర్త ఐదేళ్ల క్రితం మృతి చెందగా, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె కుమారుడు జిల్లేపల్లి వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.

నేడు సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశం

మిర్యాలగూడ, సెప్టెంబరు 1: సీపీఎం నల్లగొండ జిల్లా ప్లీనరీ సమావేశాన్ని సెప్టెంబరు 2వ తేదీన మిర్యాలగూడలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి రవినాయక్ తెలిపారు. పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని నందిపాడ్ రోడ్డులోని బృందావన్ గార్డెన్స్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు ప్లీనరీ సమావేశం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. సమావేశానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి హాజరవుతారని తెలిపారు. సమావేశానికి పార్టీ జిల్లా, మండల కమిటీల సభ్యులు ప్రజా సంఘాల నాయకులు, పుల్‌టైమర్స్, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.